క్లుప్తంగా

ఇళ్ల మధ్య మద్యం సేవిస్తే జైలుకే..

ఎస్‌ఐ రాజేశ్‌నాయక్

మునిపల్లి(అందోల్): ఇళ్ల మధ్య మద్యం సేవించే వారిని జైలుకు పంపిస్తామని బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ హెచ్చరించారు. గురువారం మండలంలోని తాటిపల్లిలో ఇళ్ల మధ్య కొందరు మద్యం తాగడంపై పోలీస్‌లు నిఘా పెట్టారు. వెంచర్‌లో కొందరు జూదం (పేకాట) ఆడే వారిపై పక్కా సమాచారంతో పోలీస్‌లు తాటిపల్లిలో పర్యటించారు. కొందరు కావాలనే ఇళ్ల మధ్య మద్యం సేవిస్తున్నట్లు తెలిసిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు కళజాత బృందాలు అవగాహన కల్పిస్తున్నాయి. మండలంలోని మల్లికార్జునపల్లి, మునిపల్లి, బుస్సారెడ్డిపల్లి గ్రామాల్లో కళాజాత బృందాలు పాటల రూపంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

వనభోజనాలను విజయవంతం చేయండి

జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్

సంగారెడ్డి టౌన్: వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న సంగారెడ్డిలోని మంజీరా డ్యాం ఉమామహేశ్వర శివాలయంలో కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనభోజనాల కార్యక్రమంలో దేవాలయంలో అభిషేకం పూజా కార్యక్రమాలు ఉంటాయని, 108 శివ యోగి శివ చార్యస్వాముల చేత ప్రవచనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ధనుంజయ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పాటిల్, గోవురాజు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయిని

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం, సిరిపురం గ్రామపంచాయతీ కార్యాలయ అవసరాలకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న కంప్యూటర్‌ను గురువారం బహూకరించారు. ఉపాధ్యాయులు కంప్యూటర్‌ను బహూకరించడం స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కాంగ్రెస్ నేత నీలం మధు



సమావేశంలో మాట్లాడుతున్న మధు

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని కొల్లాపూర్ పట్టణం ఎస్ ఎమ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సాంప్రదాయ మత్స్యకారుల 8వ మహాసభలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పగిడీల శ్రీనివాస్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ..నీలి విప్లవంతోనే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. అందుకే చెరువుల సంరక్షణకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మత్స్యశాఖ వైస్ చైర్మన్ మల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ వెంకటస్వామి, మత్స్యశాఖ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో కల్యాణ రామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ప్రధాన ద్వారం ఏర్పాటు సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తున్న జీతాలు సరిపోవడం లేదని, రూ. 26 వేలకు జీతం పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుధాకర్, ఎలిషా, అఖిల్, పవన్, కృష్ణ, వసీం,అనిల్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం

- రెండు నెలల్లో వినియోగంలోకి..
- నెల రోజులు రైల్వే గేటు మూసివేత
- త్వరలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



రైల్వే గేటు వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ప్రధాన రహదారిపై రైల్వేగేటు వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి రోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. త్వరలో ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయి. రెండు నెలల్లో మిగులు పనులు పూర్తి చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకొస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు నెల రోజుల పాటు రైల్వే గేటును మూసి వేస్తున్నామని, ట్రాఫిక్‌ను అల్లాన రోడ్డు గుండా మళ్లిస్తున్నట్లు చెప్పారు.

జహీరాబాద్ పట్టణంగుండా 65వ జాతీయ రహదారి వెళ్తుండగా కర్నాటక, మహారాష్ట్రాలతో పాటు జహీరాబాద్ పరిసర గ్రామాల ప్రజలు కూడా ప్రతిరోజు పట్టణానికి ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిపై పట్టణ సమీపంలో రైల్వే గేటు ఉంది. రైళ్ల రాకపోకల సమయంలో గేటు పడిన ప్రతిసారి ఇరుపక్కల వాహనాలు ఆగాల్సి వస్తుంది. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికంగా ఉండడం వల్ల రైలు వచ్చినప్పుడు ట్రాఫిక్ జాం అవుతోంది. గూడ్స్ రైళ్ల రాకపోకల సమయంలో ఒకోక్కసారి 30 నిముషాలకు పైగా గేటు మూసి ఉంటుంది. ఆ సమయంలో ప్రయాణికులు ఎటు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేళ్లుగా అవస్థలు

ట్రాఫిక్ నియంత్రణ కోసం రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పలుమార్లు మాజీ మంత్రి హరీశ్‌రావును అప్పట్లో కోరారు. ఈ మేరకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 90 కోట్ల నిధులను మంజూరయ్యాయి. ఆరు సంవత్సరాల క్రితం పనులకు శ్రీకారం చుట్టగా ప్రారంభంలో వేగంగా జరిగాయి. తరువాత నత్తనడకన సాగడంతో సాక్షి దినపత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తి కాగా, బిల్లుల కారణంగా కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. బిల్లుల విషయాన్ని కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ్మా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల బిల్లులు విడుదల కావడంతో కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంభించారు. బీదర్ చౌరస్తా నుంచి మొగుడంపల్లి క్రాస్ రోడ్డు వరకు రెండు వైపుల సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు కూడా పూర్తికావచ్చాయి.

ట్రాఫిక్ మళ్లింపు



గేటుకు ఇరువైపుల ఆగిన వాహనాలు

రైల్వే గేటు వద్ద సర్వీస్ రోడ్డు పనుల కోసం నెల రోజుల పాటు గేటు మూసివేస్తున్నట్లు డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 22 నుంచి డిసెంబర్ 22 వరకు రోడ్డు మూసివేసి వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. బీదర్, మహీంద్ర అండ్ మహీంద్ర, చిరాగ్‌పల్లి వైపు వెళ్లే వాహనాలను అల్గోల్, అల్లాన గుండా దారి మళ్లిస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రాజెక్టు ఆధునీకరణకు చర్యలు

ఇరిగేషన్ శాఖ సీఈ కె.ధర్మా



కాల్వలను పరిశీలిస్తున్న సీఈ కె.ధర్మా

కల్హేర్(నారాయణఖేడ్): ఉజలంపాడు ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసకుంటున్నామని ఇరిగేషన్ శాఖ సీఈ కె.ధర్మా పేర్కొన్నారు. గురువారం సిర్గాపూర్ మండలంలోని ఉజలంపాడు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు స్థితిగతులు, ఆయకట్టు వివరాలు, కాల్వలను పరిశీలించారు. కాల్వలు నిర్మించి ఆయకట్టుకు సాగునీరు అందించేలా అధికారులతో చర్చించారు. పూర్తి నివేదిక రుపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఏసయ్య, ఈఈ సుందర్, డీఈఈలు పవన్ కుమార్, విజయ్‌కుమార్, ఏఈ రవి ఉన్నారు.

సుక్కల్‌తీర్థ్ కొత్త చెరువు పనుల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని సుక్కల్ తీర్థ్ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న చెరువు పనులను గురువారం నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతతో పాటు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, గత సంవత్సరం నుంచి నిలిచిపోయిన పనుల వివరాలు తెలుసుకొన్నారు. కార్యక్రమంలో డీఈఈలు డి.విజయ్‌భాస్కర్, బి. పవన్‌కుమార్, ఏఈ మైలారం రవి, క్షేత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదులో వేగం పెంచాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

కంది(సంగారెడ్డి): ఓటర్ నమోదులో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ విజయలక్ష్మి బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం కంది తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ నమోదుపై సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటర్‌గా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 23, 24న స్పెషల్ క్యాంపెనింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో కొత్త ఓటర్ నమోదు, చనిపోయిన వారి పేర్లను తొలగించడం, తప్పులను సరిదిద్దడం వంటివి చేపట్టాలన్నారు. డిసెంబర్ ఆఖరు వరకు ఓటర్ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మొదటి వారంలో ఫైనల్ ఓటర్ లిస్టును ప్రకటించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మల్లేశం, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు



పశువులకు చికిత్సలు చేస్తున్న వైద్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పశువులకు కృత్రిమ గర్భధారణ టీకాలు వేయడం వల్ల మేలు జాతి ఆడదూడలను పొందవచ్చునని న్యాల్‌కల్ పశువైద్యాధికారి డాక్టర్ గణేష్ అన్నారు. గురువారం మండలంలోని మామిడ్గి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 28 పశువులకు గర్భస్థ పరీక్షలు, 17 పశువులకు సాధారణ చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ ఎదకు వచ్చిన పశువులకు సకాలంలో టీకాలు వేయించుకోవాలని పశుపోషణదారులు, రైతులకు సూచించారు. పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధులు సోకిన వెంటనే సమీపంలోని పశువైద్య కేంద్రాలకు తీసుకువెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కిషన్‌రావు మాణిక్‌రెడ్డి, తుక్కారెడ్డి, ఎల్లారెడ్డి, జగనాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, ధన్‌రాజ్, చంద్రయ్య పాల్గొన్నారు.

మళ్లీ నిలిచిపోయిన నీటి సరఫరా

- తాగునీటి కోసం ప్రజలు పాట్లు
- హామీని నిలబెట్టుకొని అధికారులు



ఆందోళన చేస్తున్న కార్మికులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మిషన్ భగీరథ పథకం కార్మికులు మళ్లీ ఆందోళనకు దిగారు. దీంతో తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. సమయానికి జీతాలు చెల్లించకపోవడంతో రెండు నెలల క్రితం కార్మికులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఇటీవల అధికారులు కార్మికులతో చర్చలు జరిపి 15 రోజుల్లో జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు విధుల్లో చేరారు. కాని ఇచ్చిన హామీని అధికారులు నిలబెట్టుకోక పోవడంతో వారు మళ్లీ ఆందోళనకు దిగారు. న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని గ్రామాలతో పాటు తండాలకు చాల్కి పిల్టర్ బెడ్ ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతోంది. నీటి సరఫరా పథకంలో తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడంతో 43 రోజుల పాటు వారు సమ్మెబాట పట్టారు. ఫలితంగా ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయి తాగు నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దీంతో దిగొచ్చిన అధికారులు ఈ నెల 3న ఆందోళన చేస్తున్న కార్మికులతో చర్చించి నెల రోజుల జీతం చెల్లించారు. మిగిలిన 7నెలల జీతాలు 15 రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు విధుల్లో చేరారు. మీరు ఇచ్చిన గడువు ముగిసింది. జీతాలు ఎప్పుడిస్తారని కార్మికులు ప్రశ్నించగా అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కార్మికులు ఈనెల 20 నుంచి ఆందోళనకు దిగారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. సమ్మె కారణంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా రోజులుగా జీతాలు ఇవ్వకపోవడం వల్ల తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, జీతాలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తానమని కార్మికులు తేల్చి చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పంట వ్యర్థాలను కాల్చొద్దు

ఏడీఏ నూతన్‌కుమార్



నారాయణఖేడ్: వరికోతలు పూర్తవుతున్న క్రమంలో రైతుల వరి అవశేషాలను భూసారం, పర్యావరణానికి అనువుగా ఉపయోగించుకోవాలని ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. నారాయణఖేడ్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలా మంది రైతులు వరికొయ్యలను తగులబెట్టడం వల్ల ఉపయోగం లేకుండా పోతుందన్నారు. పంట అవశేషాలను నేలల్లో కలపడం వల్ల సహసిద్ధంగా సేంద్రియ ఎరువుగా మారి భూసారాన్ని పెంచుతుందని తెలిపారు. కంపోస్టు ఎరువుగా తయారవుతుందని చెప్పారు. వ్యవసాయ పరంగా ఏమైనా సమస్యలుంటే రైతులు తమను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

కల్హేర్(నారాయణఖేడ్): కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం విక్రయించేందుకు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం కల్హేర్, మార్డి, కృష్ణాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన ధాన్యం కుప్పలు పరిశీలించారు. వరికోతలు పూర్తి కావడంతో వరి కొయ్యలు కాల్చొద్దని రైతులను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష, కృష్ణవేణి, ప్రతిభ పాల్గొన్నారు.

పీసీసీ ప్రెసిడెంట్‌ను కలిసిన నేతలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు గురువారం గాంధీభవన్‌లో పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని మున్సిపల్ నాయకులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

జహీరాబాద్ టౌన్: ముంబాయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ ఆర్గనైజేషన్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఆర్ట్స్‌పోటీలో పట్టణంలోని డాక్టర్ ఆర్ ఎల్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కలరింగ్, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్‌కార్డు, టాటూ, కార్టూన్, స్కెచ్చింగ్, ఫింగర్ తబ్ పెయింటింగ్ పోటీలు నిర్వహించగా 34 మందికి బహుమతులు వచ్చాయి. మొదటి బహుమతి అక్షయ సాహూ, చిత్రపవార్‌కు 3వ బహుమతి, అక్షయ సాహుకు 7వ బహుమతి లభించింది. 50 మంది బంగారు పతకాలు, 42 మంది వెండి పతకాలు, 20 మంది రజత పతకాలను సాధించారన్నారు. 15 మంది విద్యార్థులకు కాన్సలేషన్ బహుమతులు వచ్చాయి. ఈ మేరకు గురువారం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ కవిత, క్యాంపస్ ఇన్‌ఛార్జి సయ్యద్ అజీజ్, ఇన్‌చార్జిలు శ్రీదేవి, రమేష్, విజయలక్ష్మి విద్యార్థులను అభినందించారు.

కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

పటాన్‌చెరు టౌన్: ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పటాన్‌చెరు గ్రామిక్ భవన్‌లో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 950 మంది ఆశ వర్కర్లు ఉన్నారని గుర్తు చేశారు. వీరు గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నారని, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కేవలం రూ. 9 వేల గౌరవ వేతనం తీసుకుంటున్నారని అన్నారు. ఆశలకు కనీస వేతనం రూ.18 వేల ఇవ్వాలని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆశవర్కర్లు హైమావతి, గీత, అంజమ్మ, వైష్ణవి, లావణ్య, వీరమణి, నాగమణి పాల్గొన్నారు.

ప్రజలకు ఏం చేశారని విజయోత్సవాలు

బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి



జిన్నారం (పటాన్‌చెరు): ప్రజలకు ఏం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి విజయోత్సవాలు జరుపుకొంటున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచి సంవత్సరం పూర్తి కావస్తుందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా మహాలక్ష్మి కల్యాణలక్ష్మి తులం బంగారం, ఇందిరమ్మ ఇళ్లు ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద లిస్టు అవుతుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. విజయోత్సవాలు నిర్వహించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆ తరువాతే విజయోత్సవాలను నిర్వహించుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఇశ్రితాబాద్ గ్రామంలో రూ.10లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు బలరాం శ్రీనివాస్, శ్రీనివాస్, రషీద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యలు పట్టని ప్రభుత్వం

నారాయణఖేడ్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల బిల్లుల నిధులను వెంటనే విడుదల చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర్య విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి గురువారం వినతపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా విద్యావ్యవస్థను పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో పవన్, నరేష్, సాయి, ప్రదీప్ పాల్గొన్నారు.

◆ ఫోరెనిక్స్ సైన్స్‌పై అవగాహన

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులకు ఫోరెనిక్స్ సైన్స్‌పై ఫోరెనిక్స్ ల్యాబ్ డైరెక్టర్ మోహన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోరెనిక్స్ సైన్స్ న్యాయవ్యవస్థలో కీలకమైందన్నారు. ఫోరెనిక్స్ శాస్త్రవేత్తలు సేకరించిన నేర దృశ్యాలు, సాక్ష్యాలు విచారణలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

◆ ఘనంగా గరుడోత్సవం

కంది(కంది): మండల కేంద్రం కందిలో శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజూ గురువారం ఉ.11గంటలకు స్వామివారి గరుడోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కందిలోని పురవీధుల గుండా గరుడోత్సవ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దీపక్ దేశ్ ముఖ్, సునీల్‌దేశ్‌ముఖ్ భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు వైద్య పరీక్షలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలను నిర్వహించారు. మెడికల్ అధికారి డాక్టర్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. తినే ఆహారం , పరిశుభ్రతపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ మొగుడంపల్లి ఏఓగా హస్నోద్దీన్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల వ్యవసాయ అధికారిగా హస్నోద్దీన్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. మండల ఏఓగా ఉన్న వినోద్‌కుమార్ ఏడీఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో హస్నోద్దీన్ బదిలీపై వచ్చారు.

◆ ఘనంగా అయ్యప్ప పడిపూజ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం, బొంతపల్లి మాజీ సర్పంచ్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం అయ్యప్పస్వామి మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడి పాడారు. అయ్యప్ప నామస్మరణతో బొంతపల్లి మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప మాలధారణ, స్వాములు భక్తులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

◆ నోటిఫికేషన్ విడుదల

సంగారెడ్డి ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (లోయర్ అండ్ హైయ్యర్ గ్రేడ్ ఇన్ డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ) పరీక్ష నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు లోయర్ గ్రేడ్ పరీక్షకు అర్హులన్నారు. లోయర్ గ్రేడ్ టెక్నికల్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు హైయ్యర్ గ్రేడ్‌లో సంబంధిత ట్రేడ్ పరీక్షకు అర్హులని తెలిపారు. రాష్ట్ర బోర్డు కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఉత్తీర్ణులైన వారు ముందుగానే డైరెక్టర్, గవర్నమెంట్ ఎగ్జామ్స్ తెలంగాణ నుంచి అనుమతి పొందాలని, లేని పక్షంలో దరఖాస్తును తిరస్కరించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.bre.teanfana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

◆ లోక్ అదాలత్‌తో ప్రయోజనం

జహీరాబాద్ టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసులు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీమార్గంతో సమయం వృథా కాకుండా ఉంటుందని చెప్పారు. చట్టాలను గౌరవించి నిబంధనలు పాటించాలన్నారు.

◆ నేడు విద్యుత్ అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా పలు కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గురువారం విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉ.10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రామచంద్రాపురం ఆయా కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5గంటల వరకు రామచంద్రారెడ్డి నగర్, నాగులమ్మ ఆలయ ప్రాంతం, స్నేహలేక్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, జీహెచ్‌ఎంసీ కార్యాలయం ప్రాంతం, బీడీఎల్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బల్కంచెల్క తండాలో విశ్వపాలిని భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరం 12వ వార్షికోత్సవాలు గురువారం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి, మందిరం ధర్మకర్త మూడ్ కిషన్ సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, గంగ పూజ ఆవాహిత మంట పూజలు, అభిషేకం అలంకరణం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిషన్‌నాయక్, శంకర్, రాములు, కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌సింగ్, జైపాల్, గోవింద్ పాల్గొన్నారు.